

ముగిసిన నవోదయ ప్రవేశ పరీక్ష

882 మంది విద్యార్థుల హాజరు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో రవీందర్ రెడ్డి తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల పరీక్షకు మానుకోటలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, మోడల్‌స్కూల్, మరిపెడలోని సెయింట్ ఆగస్టిన్, మోడల్‌స్కూల్, గూడూరులోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలల్లో ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎంట్రెన్స్ 1,118 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానుండగా, 882 మంది హాజరయ్యారన్నారు.

నిధుల్లేక.. నీరసం

కష్టాల్లో 'బెస్ట్ అవైలబుల్' విద్యార్థులు

- మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి రాని సొమ్ములు
- జిల్లాలో రూ.2.44కోట్లు పెండింగ్
- అప్పుల్లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు
- అయోమయంలో స్టూడెంట్స్ తల్లిదండ్రులు
- అధికారులు స్పందించాలని వేడుకోలు

నెహ్రూసెంటర్, జనవరి18 (ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన పేదలకు నాణ్యమైన చదువును అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రారంభించిన 'బెస్ట్ అవైలబుల్' పథకం నిధుల్లేక నీరసిస్తోంది. గిరిజన సంక్షేమశాఖ ద్వారా 'బెస్ట్ అవైలబుల్' స్కీంను ఏర్పాటు చేసి, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఆర్థిక వెసులుబాటు కల్పించి, కార్పొరేట్ విద్యను అందిస్తుంది. ఈ పథకం కింద చదువుతున్న గిరిజన విద్యార్థులకు గత మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో వారు అవస్థలు పడుతున్నారు. దీంతో ఈ నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల నుంచి ఇబ్బందులు తప్పడం లేదు. సర్కారు నుంచి నిధులు విడుదల కాకపోవడంతో నిర్వహణ కష్టమవుతోందంటూ ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యం చేతులెత్తేసింది. 'బెస్ట్ అవైలబుల్' స్కీంలో చదువుతున్న విద్యార్థులు ఫీజు కట్టాలని యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. ఎన్నో ఆశలతో ఈ పథకం ద్వారా సీటు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు చెల్లించే స్థోమత లేక ఆందోళనకు గురవుతున్నారు.

జిల్లాలో 398 మంది విద్యార్థులు..


మహబూబాబాద్ జిల్లాలోని ఆరు ప్రైవేట్ పాఠశాలల్లో 398 మంది గిరిజన విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా సీట్లుపొంది, విద్యనభ్యసిస్తున్నారు. అయితే మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి రూ.2,44,15,000 బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఇక నిర్వహణ కష్టమవుతోందంటూ తమ పిల్లలు పాఠశాలలో విద్యనభ్యసించాలంటే తల్లిదండ్రులు ఫీజులు కట్టాల్సిందేనంటూ ఆయా స్కూళ్ల యజమానులు ఒత్తిడి చేస్తున్నారు. ఇటీవలే సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్లిన విద్యార్థులు తిరిగి స్కూళ్లకు వచ్చేటప్పుడు ఫీజులతో రావాలని సూచించినట్లు తెలిసింది.

స్కూళ్ల వారీగా బకాయిలు ఇలా..

జిల్లా వ్యాప్తంగా ఆరు ప్రైవేట్ పాఠశాలల్లో గిరిజన సంక్షేమ శాఖలోని బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా 398 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారికి ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తొర్రూరు మండలంలో అబ్యాస్ స్కూల్‌కు రూ.55,88,000, పీఎస్ఆర్ పాఠశాలకు రూ.33 లక్షలు, లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌కు రూ.55 లక్షలు, మహబూబాబాద్‌లో విద్యాభారతి పాఠశాలకు రూ.33 లక్షలు, ఫాతిమా పాఠశాలకు రూ.50 లక్షలు, ఎస్వీ విద్యాలయంకు రూ.18 లక్షలు వెరసి జిల్లా వ్యాప్తంగా రూ.2.44 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి.

అందని యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు..

బెస్ట్ అవైలబుల్ స్కీంకు ఎంపికైన విద్యార్థులకు కార్పొరేట్ విద్యతో పాటు రెసిడెన్షియల్ సౌకర్యం, మౌళిక వసతులు, యూనిఫాం, షూ, పాఠ్యపుస్తకాలు, నిత్యావసర వస్తువులతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. కానీ, మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సౌకర్యాల్లో కోత విధించింది. నేటికి యూనిఫాం, షూ, పాఠ్యపుస్తకాలకు నోచుకోక గిరిజన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రాన్ని అందచేస్తున్న ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు (ఫైల్)

పెట్టుబడులు పెట్టలేం..



ఎక్కడా లోటులేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం బెస్ట్ అవైలబుల్ స్కీం విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నాం. గత మూడేళ్లుగా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పెట్టుబడులు పెట్టలేక ఇబ్బందులు పడుతున్నాం. తక్షణమే నిధులను విడుదల చేయాలి.

- అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

నిధులు ఈ క్యూబర్‌లో ఉన్నాయి..



బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఫీజులు కట్టాలని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఒత్తిడిచేయొద్దు. గత మూడేళ్ల నిధులు మంజూరై ఈ క్యూబర్‌లో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే త్వరలోనే ప్రైవేట్ యాజమాన్యాల ఖాతాలో జమ అవుతాయి. విద్యార్థుల నుంచి బలవంతంగా ఫీజులు వసూలు చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

- గుగులోతు దేశీ రాంనాయక్, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్, మహబూబాబాద్

ఫీజులతో రండి..

సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్లిన విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం హుకుం జారీ చేసింది. మూడేళ్లుగా బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులు రావడం లేదు. ఫీజులు చెల్లిస్తేనే స్కూల్లోకి అనుమతి ఇస్తామని, లేదంటే తిరిగి మళ్లీ ఇంటికి వెళ్లాల్సిందేనని తేల్చి చెప్పేశారు. దీంతో బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక మనోవేదనకు గురవుతున్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి



మానుకోటలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళ్లర్పిస్తున్న టీడీపీ నాయకులు

- జిల్లా వ్యాప్తంగా రామారావు వర్ధంతి
- సేవలను కొనియాడిన టీడీపీ శ్రేణులు
- జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ

8

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు టౌన్-1 ఏఈ సంగీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నందినగర్, గుండ్లకుంట కాలనీ, ఆర్టీసీ కాలనీ, గిరిప్రసాద్‌నగర్, ఎల్‌బీజీనగర్, రాహుల్‌నగర్, కంకరమిల్లు తండా, చిట్యాల గోపయ్యనగర్, ఏటిగడ్డతండా, రాంచంద్రాపురం కాలనీ, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆకుల లక్ష్మయ్య కాలనీ, అంబేద్కర్ కాలనీల్లోని చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మితిమీరిన వేగంతో వాహనాలు నడుపవద్దు

ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి, రోడ్డు ప్రమాదాలకు గురై కుటుంబసభ్యులకు తీరని వేదనను మిగుల్చుతున్నారని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు నిబంధనలపై ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ వాహనదారులు కొద్దిరోజులు మాత్రమే నిబంధనలు పాటిస్తూ, మళ్లీ యథావిధిగా మారుతున్నారన్నారు. చట్టాలు కఠినంగా అమలు చేస్తే వచ్చే ఫలితాల కన్నా ప్రజలు స్వచ్ఛందంగా చట్టం పరిధిలో నడుచుకుంటేనే ఆశించిన ఫలితాలు వస్తాయని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఏటా దేశవ్యాప్తంగా రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అజాగ్రత్తగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురైమృతి చెందిన వారిలో హెల్మెట్ లేకుండా, సీటు బెల్టులేకుండా పరిమితికి మించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైన వారే అధికంగా ఉన్నారన్నారు. మద్యంతాగి వాహనాలు నడిపే వారివల్ల, ర్యాష్ డ్రైవింగ్ వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలతో భారీగా ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన తర్వాత రవాణాశాఖ నుంచి డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తర్వాతనే వాహనాలు నడపాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జిల్లాలో వాహనదారులకు, ఆటో డ్రైవర్లకు, లారీ డ్రైవర్లుకు, ఆర్టీసీ డ్రైవర్లతో పాటు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రవాణా, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలునిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలుజరుగకుండా ఉండాలంటే వాహనదారుల్లో స్వచ్ఛందంగా మార్పు రావాలని పేర్కొన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదంలో మరణిస్తే కుటుంబసభ్యులకు కలిగే ఆవేదనను ప్రతీ ఒక్కరు దృష్టిలో ఉంచుకోవాలన్నారు.

కేసముద్రం మునిసిపాలిటీ గెజిట్ విడుదల

ప్రభుత్వ ఉత్తర్వులు వస్తే అమలులోకి పురపాలకం

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మునిసిపాలిటీగా ఏర్పాటు చేస్తూ రాష్ట్రప్రభుత్వ అధికారిక ప్రచురణ రాజపత్రం (గెజిట్) శుక్రవారం రాత్రి విడుదలైంది. ఈ గెజిట్‌లో కేసముద్రం విలేజి, కేసముద్రం స్టేషన్, అమీనాపురం, ధన్నసరి, ఎస్టీకాలనీ సబ్ స్టేషన్ తండా గ్రామపంచాయతీలను మునిసిపాలిటీలుగా చేస్తూ ప్రచురించారు. గత ఏడాది డిసెంబర్ 8న ప్రతిపాదిత విలీన ఐదు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, మునిసిపాలిటీపై తీర్మానం చేసి పంపాలని జిల్లా అధికారుల నుంచి మండల అధికారులకు ఆదేశాలు అందాయి. అదేనెల 9న ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి తీర్మానాలను ప్రభుత్వానికి అధికారులు పంపించారు. ఈ తీర్మానాల ఆధారంగా జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. అదేనెల 20న కేసముద్రం మండల కేంద్రాన్ని మునిసిపాలిటీగా రాష్ట్ర అసెంబ్లీ ప్రతిపాదించగా పురపాలక శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శాసనసభలో నూతన మునిసిపాలిటీల ఆమోదిస్తూ ప్రకటించారు. నూతన మునిసిపాలిటీ ఏర్పాటుకు సంబంధించిన 'మునిసిపాలిటీ చట్టం (సవరణ)-2025'ని ఈనెల 3న గవర్నర్ ఆమోదం పొందగా 4న రాజపత్రం ప్రచురితమైంది. ఈ గెజిట్ ప్రతిని శుక్రవారం రాత్రి ప్రభుత్వం విడుదల చేసింది.

ప్రభుత్వ ఉత్తర్వులే తరువాయి..

మునిసిపల్ చట్టం (సవరణ)-2025 గెజిట్ ఆధారంగా ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో) విడుదల చేసిన రోజు నుంచి కేసముద్రంగా మునిసిపాలిటీ సాంకేతికంగా అమలుకాబోతోంది. 'గెజిట్' అనేది ప్రభుత్వ నిర్ణయాల అధికారిక రికార్డుగా పనిచేస్తుండగా 'ప్రభుత్వ ఉత్తర్వులు' అనేవి విధానాలు, నియమాలు, పరిపాలన నిర్ణయాలను అమలు చేయడానికి అధికారిక నిర్దిష్ట ఆదేశంగా పేర్కొంటారు. దీంతో జీవో విడుదలైతే పూర్తిస్థాయిలో కేసముద్రం మునిసిపాలిటీగా ఆవిర్భవించి, ఆ మేరకు కార్యకలాపాలు ప్రారంభించనున్నారు. ఏదేమైనా కేసముద్రాన్ని మునిసిపాలిటీగా చేయడం ఓ చారిత్రాత్మక నిర్ణయమని పలువురు భావిస్తున్నారు.



'స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తు చేసుకోవాలి'

నెహ్రూసెంటర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : షెడ్యూల్ తెగల సంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు 2024-25 ఆర్థిక సంస్థలు సహాయ పథకం కోసం ఫిబ్రవరి 15 లోగా 'ఆన్‌లైన్'లో దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ జిల్లా ఉపసంచాలకుడు దేశీ రాంనాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 1నుంచి దరఖాస్తులనుస్వీకరిస్తున్నామని, ఫిబ్రవరి 15 వరకు గడువు ఉందని వివరించారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్http-s://ngo. trible.gov.in ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇతర సమాచారం కోసం గిరిజన సంక్షేమశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

నిరుపేదల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ విప్ జాటోతు రాంచందర్‌నాయక్
- బలపాలలో పీహెచ్‌సీ భవనం ప్రారంభం



బలపాల పీహెచ్‌సీ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న రాంచందర్‌నాయక్

కురవి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో నిరుపేదల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్ అన్నారు. బలపాలలో రూ.1.43 కోట్లతో నిర్మించిన నూతన పీహెచ్‌సీ భవనాన్ని శనివారం ప్రారంభించి, మాట్లాడారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు మాలోతు నెహ్రూనాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్, డీఎంహెచ్‌వో మురళీధర్, ప్రముఖ వైద్యులు దేవులపల్లి కేశవరావు, అంబటి వెంకటనారాయణ, గొల్లపల్లి రజినీకాంత్, బండి వెంకట్‌రెడ్డి, అవిరె మోహన్‌రావు, బాలగాని శ్రీనివాస్, కాలం రవీందర్‌రెడ్డి, డాక్టర్ స్రవంతి, బిక్కునాయక్,మొగిలిచర్ల నాగేశ్వర్‌రావు, ముండ్ల రమేష్, నెల్లూరు శ్రీనివాస్, లింగ్యానాయక్ పాల్గొన్నారు.

వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

సీరోలు, (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యా, వైద్యరంగానికి పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ అన్నారు. కొత్తూరు (సి) గుజిలితండాలో గతంలో విద్యార్థులు లేక మూసివేసిన ప్రాథమిక పాఠశాల పునఃప్రారం, సీరోలులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి శనివారం భూమి పూజచేసి, మాట్లాడారు. కాగా, ప్రైవేటు వ్యక్తి భూమిలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి భూమిపూజ చేయడం నిలిపివేయాలని లంబాడ హక్కుల పోరాట సంఘం (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమానాయక్ నిరసన చేపట్టగా, పోలీసులు అక్కడకు చేరుకొని వారిని నివారించారు. అనంతరం సీరోలులో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు మాలోతు నెహ్రూనాయక్, మానుకోట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌నాయక్, సీరోలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, మండల కో-ఆర్డినేటర్ కాలం రవీందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఇస్లావత్ లచ్చిరాంనాయక్, వాంకుడోతు బాలాజీనాయక్, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మరిపెడ(ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. మరిపెడలో పలువురు లబ్ధిదారులకు రూ.3.14కోట్ల విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసి, అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, సీఐ రాజ్‌కుమార్, ఆర్ఐ శరత్, జిల్లా కాంగ్రెస్ నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, మండల, టౌన్ పార్టీ అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి, ఎస్కే. తాజ్‌ద్దీన్, మునిసిపల్ కౌన్సిలర్ ప్రగతి శ్రీపాల్‌రెడ్డి, మైనార్టీ నాయకులు అఫ్జల్, అప్సర్, మరిపెడ మాజీ సర్పంచ్ రాంలాల్, బోర గంగయ్య, గండి వీరభద్రం, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. విశ్రాంతి భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. గుండగాని వేణు తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వీడియోకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మంత్రులు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జనవరి18 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే సంకల్పంతోనే కాంగ్రెస్ సర్కారు కృషి చేస్తుందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయశాఖ, జౌళి, మార్కెటింగ్, సహకార శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలుపై నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో వారు మాట్లాడారు. ప్రజాపాలన అందించాలనే లక్ష్యంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. ప్రస్తుతం జాబితాలో పేర్లురాని వారు ఆందోళన చెందవద్దని, పాత రేషన్ కార్డులను తొలగించకుండానే కొత్త కార్డులు ఇస్తామన్నారు. పేర్లు రాని అర్హులైన వారు ఈనెల 21 నుంచి జరిగే గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హులైన వారందరికీ రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అందేవిధంగా కలెక్టర్లు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, జడ్పీసీఈవో పురుషోత్తం, మహబూబాబాద్ ఆర్డీవో కృష్ణవేణి, పౌర సరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, వ్యవసాయశాఖ అధికారి విజయ నిర్మల, డీపీవో హరిప్రసాద్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

» పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



కొత్తగూడలో భూమి పూజలో పాల్గొన్న సీతక్క

కొత్తగూడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానికసంస్థల ఎన్నికల్లో అత్యధికంగా సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలు సాధించి.. కాంగ్రెస్‌పార్టీ సత్తా చాటాలని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కొత్తగూడలో నిర్మించనున్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయం భూమి పూజలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదపండితులు సీతక్కతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్, ఏటీఎఫ్ రాష్ట్ర నాయకుడు సిద్ధబోయిన లక్ష్మీనారాయణ తల్లి భూమక్క ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో సీతక్క సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, రాష్ట్ర నాయకుడు చల్లా నారాయణరెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, మాజీ జడ్పీటీసీ పుల్సం పుష్పలతశ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.మొగిలి పాల్గొన్నారు.

లక్ష డప్పుల ప్రదర్శనకు ఉప్పెనలా తరలిరావాలి

• ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



డప్పు వాయిస్తూ ర్యాలీలో పాల్గొన్న కృష్ణమాదిగ, నాయకులు

ములుగు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : వెయ్యి గొంతులు, లక్ష డప్పుల సాంస్కృతిక మహా ప్రదర్శనకు ములుగు జిల్లా నుంచి మాదిగలు ఉప్పెనలా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే ఈ ప్రదర్శనకు సన్నాహకంగా శనివారం ములుగులో సమావేశం జరిగింది. అంతకుముందు బస్టాండు సెంటర్‌లోగల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన కృష్ణమాదిగ డప్పు వాయిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. రిజర్వేన్ల సాధనలో ఎమ్మార్పీఎస్ కీలక దశకు చేరుకుందని తెలిపారు. మహా ప్రదర్శనకు ఇంటికో డప్పుతో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఇరుగు పైడి, మడిపల్లి శ్యాంబాబు, బుర్రి సతీష్, గోల్కొండ బుచ్చన్న, రేలా కుమార్, వావిలాల స్వామి, గజ్జలప్రసాద్, పేరాల బలరాం, ప్రజాసంఘాల నాయకులు బాదం ప్రవీణ్, ముంజాల భిక్షపతి, దబ్బసుధాకర్, నరసింహ పాల్గొన్నారు.

సాగుకు యోగ్యమైన భూములకే రైతు భరోసా

తొర్రూరు, జనవరి18(ఆంధ్రజ్యోతి): సాగుకు యోగ్యమైన భూములకే రైతు భరోసా అందుతుందని, వెంచర్లు చేసిన భూములను అధికారులు క్షుణ్ణంగా సర్వే చేపట్టి వివరాలు అందించాలని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల అన్నారు. శనివారం తొర్రూరు పట్టణంలోని వ్యవసాయ భూములు సర్వీనగర్, విద్యానగర్, గోశాల ఏరియా, కంటాయపాలెం రోడ్డు, మహబూబాబాద్ రోడ్డు, అన్నారం రోడ్డు ప్రాంతాల్లో చేసిన వెంచర్లను పరిశీలించారు. వెంచర్లలో నాలా పన్ను చెల్లించని భూములు సర్వేలో చూపితే అధికారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా అందుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో భాస్కర్, ఏఈవో దీపిక, భరత్, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశ చూపారు.. మోసం చేశారు..

» కోస్టా యాప్ పేరుతో నిర్వాహకుల మాయాజాలం
» మొదట్లో డబ్బులు జమ చేసి.. ఇప్పుడు విత్‌డ్రా ఆప్షన్ క్లోజ్
» జనగామ జిల్లాలో 3వేల మంది వరకు బాధితులు
» సుమారు రూ.20కోట్ల వరకు మోసపోయిన వైనం
» పోలీసులకు ఫిర్యాదు, కేసు నమోదు

జనగామ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : అమాయకత్వంతో కొందరు.. అత్యాశతో మరి కొందరు మోసపోతున్నారు. రోజుకో సైబర్ నేరం వెలుగులోకి వస్తున్నా మనీ, లోన్, తదితర యాప్‌లు, వెబ్‌సైట్ల వలకు చిక్కిపోతున్న మోసపోతున్న వారి సంఖ్య మాత్రం తగ్గడం లేదు. పోలీసులు, మీడియా అవగాహన కల్పిస్తున్నా ఇంకా కొందరు అత్యాశతో పెట్టుబడులు పెడుతున్నారు. అలా కొందరి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న ఓ యాప్ నిర్వాహకులు వారిని బురిడీ కొట్టించారు. పెట్టుబడికి రెట్టింపు డబ్బులు వస్తాయని ఆశ చూపి సుమారు రూ.20కోట్ల మేర ముంచారు. ఆస్ట్రేలియా దేశంలోని మెల్‌బోర్న్ కేంద్రంగా నిర్వహిస్తున్న 'కోస్టా - వెల్ గ్రోన్' యాప్ నిర్వాకం.. ఐదుగురు బాధిత యువకులు పోలీసులకు చేసిన ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది.

మూడు నెలలుగా పెట్టుబడులు

జనగామ జిల్లాకేంద్రం, బచ్చన్నపేట, లింగాలఘనపురం సహా పలు మండలాలు, సిద్ధిపేట జిల్లా చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూల్మిట్ట మండలాల్లో కోస్టా-వెల్ గ్రోన్ అనే యాప్‌ను మూడు నెలలుగా కొంత మంది డౌన్లోడ్ చేసుకుంటున్నారు. చైన్ సిస్టమ్‌కు చెందిన ఈ యాప్‌లో ఒకరు లాగిన్ అయ్యి ఇతరులను చేర్పాల్సి ఉంటుంది. అలా చేరిన వారికి యాప్‌లో ఫ్రూట్స్ పేరుతో కొన్ని రకాల ఆప్షన్లు కనిపిస్తాయి. ఇందులో రూ.1000 నుంచి ఎంతైనా పెట్టుబడి పెట్టే అవకాశం ఉంటుంది. రూ.1000 ఇన్వెస్ట్ చేస్తే రూ.2000, రూ.3000 ఇస్తామంటూ ఆఫర్లు కనిపిస్తాయి. రూ.10వేలకు రూ.50వేలు, రూ.లక్షకు రూ.5లక్షలు వస్తాయంటూ యాప్‌లో కనిపిస్తుంది. కొంత మంది మొదటగా తక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టగా రెట్టింపు, మూడు రెట్లు, ఐదు రెట్లు డబ్బులు వచ్చాయి. ఈ డబ్బులు యాప్‌లో చూపించే విత్‌డ్రా ఆప్షన్ ద్వారా ఎవరికి వారు తమ తమ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసుకున్నారు. దీంతో ఆశపడిన కొందరు ఏకంగా రూ. లక్ష, రూ. మూడు లక్షలు, రూ.5లక్షలు, రూ.7 లక్షలు, రూ.10 లక్షల వరకు పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది.





విలేఖరులతో మాట్లాడుతున్న ఏఎస్పీ చేతన్ నితిన్, పోలీసు స్టేషన్‌కు వచ్చిన కోస్టా యాప్ బాధితులు

అదును చూసి లావాదేవీల నిలిపివేత

కోస్టా యాప్ నిర్వాహకులు అదను చూసి పెట్టుబడిదారులను దెబ్బకొట్టారు. జనగామ జిల్లాతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో మూడు నెలల క్రితం ప్రారంభమైన ఈ ఆన్‌లైన్ యాప్ వ్యవహారాలు కొంతకాలం బాగానే సాగాయి. పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేసేవరకు వేచిచూసి యాప్ నిర్వాహకులు సంక్రాంతి నుంచి విత్‌డ్రా ఆప్షన్‌ను క్లోజ్ చేశారు. దీంతో పెట్టుబడిదారులు గందరగోళానికి గురయ్యాయి. దీనిపై తమను చేర్పించిన ఏజెంట్లను ఆరా తీయగా పండగ సందర్భంగా బ్యాంకులకు సెలవు కావడంతో లావాదేవీలు జరగడం లేదని నమ్మబలుకుతూ వచ్చారు. పండగ అయిపోయి బ్యాంకులు ఓపెన్ అయినప్పటికీ విత్‌డ్రా కాకపోవడంతో మోసపోయామని గ్రహించారు.దాంతో జనగామకు చెందిన ఐదుగురు బాధితులు తమను చేర్పించిన ఏజెంట్లు అయిన శ్రీధర్‌యాదవ్, ఇక్రముద్దీన్ ఇంటికి శనివారం వెళ్లి నిలదీశారు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో జనగామ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రూ.20కోట్ల మేర మోసం?

జనగామ జిల్లాతో పాటు పరిసర మండలాల్లో సుమారు 2 వేల నుంచి 3 వేల మంది కోస్టా యాప్ బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. కోస్టా యాప్ పెట్టుబడిదారులను పెంచుకునేందుకు గానూ ఏజెంట్లు శ్రీధర్‌యాదవ్, ఇక్రముద్దీన్ ఆధ్వర్యంలో జనగామ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో డిసెంబరు చివరి ఆదివారం ఓ సమావేశాన్ని ఏర్పాటు చేశారని బాధితులు చెబుతున్నారు. ఈ సమావేశంలో యాప్‌లో పెట్టుబడి పెడితే రూ.లక్షల్లో లాభాలు వస్తాయని నమ్మబలికారని, తమకు కంపెనీ నుంచి కార్లు, బైకులు వచ్చాయని చూపించి ఆశ కల్పించారని వాపోయారు. ఈ సమావేశానికి ఏకంగా 500మంది హాజరయ్యారని బాధితులు అంటున్నారు. ఈలెక్కన జిల్లాలో సుమారు 2వేల నుంచి 3వేల మంది బాధితులు ఉంటారని, రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల మేర మోసం జరిగిందని బాధితులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగానూ ఈ యాప్ బాధితులు ఉన్నారని తెలుస్తోంది. చాలా మంది తమ పరువు పోతుందనే భయంతో బయటకు వచ్చి జరిగిన మోసాన్ని చెప్పడం లేదని తెస్తోంది. బాధితుల్లో సాధారణ ప్రజలతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

లాభపడతామని నమ్మాం: బాధితులు కె.నాగరాజు, జగదీశ్

కోస్టా యాప్ ద్వారా పెద్ద ఎత్తున లాభాలు వస్తాయని చెబితే నమ్మి ఇన్వెస్ట్ చేశాం. డిసెంబరు చివరి ఆదివారం నాడు ఓ ఫంక్షన్ హాల్‌లో మీటింగ్ పెట్టారు. పెద్ద ఎత్తున కమీషన్లు, లాభాలు వస్తాయనడంతో ఆశించాం. సంక్రాంతి నుంచి విత్‌డ్రా ఆప్షన్ చూపించకపోవడంతో ఏజెంట్లను అడిగాం. వారు బ్యాంకు సెలవులవల్ల ఓపెన్‌కావడం లేదని చెప్పారు. మళ్లీ అడిగితే ట్యాక్స్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిబంధనలు పెట్టిందని, దీంతో విత్‌డ్రా కావడం లేదని, యాప్‌లో ట్యాక్స్ కార్డును కొనాలని చెప్పారు. ట్యాక్స్ కార్డు కొన్నప్పటికీ విత్‌డ్రా కాలేదు. దీంతో మోసపోయామని గ్రహించి జనగామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగరాజు రూ.1.20 లక్షలు, జగదీశ్ రూ.1.50 లక్షలు నష్టపోయారు.

అనధికార యాప్‌లకు దూరంగా ఉండాలి : ఏఎస్పీ

కోస్టా యాప్‌కు సంబంధించి బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యాప్‌ను స్థానికంగా ప్రమోట్ చేసి ఏజెంట్లుగా వ్యవహరించిన శ్రీధర్, ఇక్రముద్దీన్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జనగామ ఏఎస్పీ చేతన్ నితిన్ తెలిపారు. జనగామ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. కోస్టా యాప్‌లో ఇన్వెస్ట్ చేసి మోసపోయినట్లు తమకు శనివారం ఫిర్యాదు అందిందని తెలిపారు. ఈ బాధితులు ఇంకా ఉన్నట్లు తెలుస్తోందని, దీనిపై పూర్తి విచారణ చేసిన తర్వాత ఎంత మంది బాధితులు ఉన్నారు? ఎంత మొత్తంలో డబ్బులు నష్ట పోయారన్న వివరాలు కచ్చితంగా తెలుస్తాయన్నారు. ఇలాంటి అనధికారిక యాప్‌లలో ఇన్వెస్ట్ చేసి మోసపోవద్దని జనగామ జిల్లాప్రజలకు ఆయన సూచించారు. కాగా..యాప్‌ను స్థానికంగా ప్రమోట్ చేసి ఏజెంట్లుగా వ్యవహరించిన శ్రీధర్, ఇక్రముద్దీన్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బతుకు దెరువుకు వెళ్లొస్తూ..

» రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళల మృతి
» ఆరెపల్లిలో ఆర్టీసీ బస్సు - ఆటో ఢీ





కనుకలక్ష్మి, సాంబలక్ష్మి (ఫైల్)



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

పోచమ్మమైదాన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారం చేసుకునే ఆ మహిళలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. చీపుర్లు అమ్ముకుంటూ జీవించేవారు.. తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. వ్యాపారంలో భాగంగా చీపుర్లు కొనడానికి ఆటోలో వెళ్లి వస్తుండగా ఆర్టీసీ బస్సు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు మహిళలు మృతి చెందగా ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఏనుమాముల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ కరీమాబాద్ ప్రాంతానికి చెందిన గంధ్రాతి కనుకలక్ష్మి(67), భూపతి సాంబలక్ష్మి (65) ఇద్దరూ ఇంటింటికీ తిరిగి చీపుర్లు అమ్ముతారు. హోల్‌సేల్‌గా చీపుర్లు కొనేందుకు వారు శనివారం ఆటోలో ములుగు జిల్లా పస్రాకు వెళ్లి వస్తున్న క్రమంలో ఆరెపల్లి సమీపంలో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో కనుకలక్ష్మి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన సాంబలక్ష్మిని స్థానికులు ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆటో డ్రైవర్ పూదరి భూమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు చేరుకొని కనుకలక్ష్మి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మృతిరాలి భర్త వీరస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏనుమాముల పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉమ్మడి కొత్తగూడ మండల బ్లాక్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక



మొగిలి



జనార్ధన్‌రెడ్డి

కొత్తగూడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడ, గంగారం మండలాల బ్లాక్ కాంగ్రెస్ కమిటీని పంచాయతీరాజ్ మంత్రి సీతక్క సమక్షంలో శనివారం కొత్తగూడలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎంచగూడెం గ్రామానికిచెందిన సుంకరబోయిన మొగిలి, ఉపాధ్యక్షుడిగా కోనాపురం గ్రామానికి చెందిన కర్ర జనార్ధన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 19 మంది కార్యవర్గ సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. తమపై నమ్మకంతో ఎన్నుకున్నందుకు మొగిలి, జనార్ధన్‌రెడ్డి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

మేడారంలో ముందస్తుగా వైద్య శిబిరాలు

» 25నుంచి జాతర ముగిసే వరకు నిర్వహణ
» ములుగు డీఎంహెచ్‌వో గోపాల్‌రావు



మేడారం జాతర కోసం మందుల నిల్వలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

ములుగు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క, సారలమ్మ మినీ జాతర నేపథ్యంలో భక్తులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యశిబిరాలను ముందస్తుగా ఏర్పాటు చేయనున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు అన్నారు. ఈనెల 25 నుంచే శిబిరాలను ప్రారంభించి జాతర ముగిసే వరకు వరకు నిర్వహిస్తామని వెల్లడించారు. జాతర నిర్వహణపై శనివారం ములుగులో ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఫార్మాసిస్టులు, సీనియర్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. శిబిరాల నిర్వహణకోసం డాక్టర్లు, ఫార్మాసిస్టులు, ఆరోగ్య, ఆశాకార్యకర్తలను నియమించామని తెలిపారు. ఇందు కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. అవసరమైన సర్జికల్ పరికరాలు, మందుల కోసం ఇండెంట్ పెట్టాలని సూచించారు. సమావేశం అనంతరం మందుల నిల్వలను పరిశీలించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్‌కుమార్, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు పవన్, రణధీర్, చంద్రకాంత్, సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సంపత్‌రావు, ఎన్‌సీడీ కోఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పన్నులు 50 శాతం తగ్గింపు

మరిపెడ మునిసిపల్ చైర్‌పర్సన్ సింధూరకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న సింధూరకుమారి

మరిపెడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని వ్యాపార, వ్యాపారేతర, ఆస్తి పన్నులను ఇక నుంచి 50 శాతం తగ్గిస్తామని మరిపెడ మునిసిపల్ చైర్‌పర్సన్ సింధూరకుమారి అన్నారు. శనివారం మరిపెడ మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గతంలో పనిచేసిన అధికారుల తప్పిదాల వల్ల ఆస్తి పన్నులు, ఇంటి పన్నులు, వ్యాపార, వ్యాపారేతర పన్నులు ఇష్టారాజ్యంగా వేశారని కౌన్సిల్ సమావేశంలో గుర్తించి పన్నులు 50 శాతం తగ్గింపునకు తీర్మానం చేసినట్లు ఆమె పేర్కొన్నారు. మునిసిపల్ కమిషనర్ నరేశ్‌రెడ్డి, వైస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, వార్డు కౌన్సిలర్స్, కో-ఆప్షన్ సభ్యులు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఐలయ్యబావితండాలో విషాదం

• హైదరాబాద్‌కు ఉపాధి కోసం వెళ్లి విద్యుత్ షాక్‌తో మృతి



బాలు (ఫైల్)

ఇనుగుర్తి(మహబూబాబాద్ జిల్లా), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు ఉపాధి కోసం వెళ్లి విద్యుత్‌షాక్‌తో ఇనుగుర్తి మండలం ఐలయ్యబావి తండాకు చెందిన జాటోత్ బాలు(36) అలియాస్ బాలాజీ మృతి చెందాడు. తండావాసులు తెలిపిన ప్రకారం. ఎనిమిదేళ్ల క్రితం బాలు ఉపాధి కోసం తన కుటుంబంతో సహ హైదరాబాద్‌కు వెళ్లి నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని హబ్సీగూడ ప్రాంతంలోని ప్రైవేటు షాపులో నైట్‌వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి తాను పనిచేసే షాపు ఎదురుగా మరో షాపునకు చెందిన హోర్డింగ్‌ను ఆయన బావమరిది అయిన సూర్యాపేట జిల్లా తుంగతుర్తికి చెందిన మల్లేశ్‌తో కలిసి కిందకు దింపుతున్నారు. ఈ క్రమంలో విద్యుత్ వైర్లకు హోర్డింగ్ తగిలి ఇరువురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుడు బాలుకు భార్య శాంతి కుమారుడు, కుమార్తె ఉనానరు. శాంతి ఇళ్లలో పనిచేస్తుండగా బాలు నైట్‌వాచ్‌మెన్ విధులు నిర్వహిస్తున్నాడు. ఉపాధి కోసం పొట్ట చేత పట్టుకొని పట్నానికి వెళ్లి ప్రాణాలు కోల్పోవడం, శనివారం తెల్లవారుజామునే బాలు మృతి చెందిన విషయం బయటకు రాగా, తండావాసులను కలిచివేసింది. రాత్రి వరకు మృతదేహానికి పోస్టుమార్టం పూర్తికాగా, బాలు మృతితో తండాలో విషాదం నెలకొంది.

గోవిందు నరేశ్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్ జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ మాదికకు ఉస్మానియా వర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఉస్మానియా వర్సిటీ ఎకానమిక్స్ విభాగం నుంచి రిటైర్డు ప్రొఫెసర్ ఏకే వాసుదేవచారి పర్యవేక్షణలో 'వుమెన్స్ ఎంపవర్‌మెంట్ ఇన్ తెలంగాణ ఎ స్పెషల్ ఫోకస్ ఆన్ ఎస్సీ వుమెన్స్ - ఏ కేస్ స్టడీ' అనే అంశం మీద పరిశోధన గ్రంథం సమర్పించినందుకు గోవిందు నరేశ్‌కు డాక్టరేట్ ప్రకటించింది. మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో నడుస్తున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి గోవింద్ నరేశ్ మాదిగ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఈయనది హనుమకొండ జిల్లా దామెర మండలం పులుకుర్తి గ్రామం. ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లోనే ఎమ్మార్పీఎస్ ఉద్యమంలోకి ప్రవేశించి విద్యార్థి నాయకుడిగా వివిధ హోదాల్లో సమర్థవంతంగా పనిచేసి మంద కృష్ణ మాదిగ ప్రోత్సాహంతో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎదిగారు. మరోవైపు ఉన్నత చదువుల మీద దృష్టి పెట్టి ప్రస్తుతం పీహెచ్‌డీ పూర్తి చేసుకుని ఓయూ నుంచి డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా తనకు స్ఫూర్తినిచ్చిన ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ పీహెచ్‌డీ పరిశోధనను విజయవంతం పూర్తి చేయడానికి మార్గనిర్దేశం చేసి ఎంతో చొరవ తీసుకుని సహకరించిన తన ప్రొఫెసరర్ ఏకే వాసుదేవచారి, ఓయూ ఎకానమిక్స్ ప్రొఫెసర్లకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. పీహెచ్‌డీ పూర్తి చేసిన గోవింద్ నరేశ్ మాదిగకు ఓయూ అధ్యాపకులు, విద్యార్థులు ఎమ్మార్పీఎస్ ఉద్యమ శ్రేణులు అభినందనలు తెలిపారు.

పాత బస్తీలో 'మెట్రో' కూల్చివేతలు షురూ!

» మరోసారి భూసామర్థ్య పరీక్షలకు చర్యలు

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పాత బస్తీ మెట్రో నిర్మాణానికి సంబంధించిన కూల్చివేతలు ప్రారంభమయ్యాయి. ఆస్తుల సేకరణలో భాగంగా ఇటీవల చెక్కులు అందజేసిన నిర్వాసితుల ఇళ్లను తొలగిస్తున్నారు. కారిడార్‌లోని దారుల్‌షిఫా నుంచి మీరాలంమండి వరకు నిర్మాణాలను తొలగిస్తూ శిథిలాలను తరలిస్తున్నారు. మొత్తం 1100 మందిలో ఇప్పటివరకు 260 మంది అనుమతి పత్రాలు అందజేశామని, ఇందులో 50 మందికి ఇటీవల చెక్కులు పంపిణీ చేశామని అధికారులు చెబుతున్నారు. ఫిబ్రవరి 20లోపు 1100 మందికి చెక్కులు అందజేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. నిర్వాసితులందరికీ చెక్కులు పంపిణీ చేస్తే మార్చి 1 నుంచి నిర్మాణ పనులను ప్రారంభించేందుకు హెచ్ఏఎంఎల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట వరకు చేపడుతున్న కారిడార్ నిర్మాణంలో భాగంగా హెచ్ఏఎంఎల్ అధికారులు మరోసారి భూసామర్థ్య పరీక్షలు చేపట్టారు.

మెరుగైన సేవలందించే దిశగా పోలీసులు

» శాఖ ప్రతిష్ఠను పెంచేలా కార్యక్రమం: డీజీపీ జితేందర్

హైదరాబాద్, జనవరి18(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పోలీసులు మరింత మెరుగైన సేవలందించేలా తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ వినూత్న శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శనివారం డీజీపీ కార్యాలయంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీసు అధికారులతో ఆయన సమావేశమయ్యారు. పోలీసు విభాగాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడం, శాఖ ప్రతిష్ఠను పెంపొందించేలా ప్రవర్తన ఉండటం, మహిళల భద్రత, సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకోకుండా ఉండటం తదితర అంశాలపై పోలీసు సిబ్బందికి సూచనలిచ్చారు. ప్రతి జిల్లా నుంచి కొంతమంది పోలీసులను ఎంపిక చేసి నూతన లక్ష్యాలపై శిక్షణ ఇవ్వడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

ధన్గర్ కులాన్ని బీసీ జాబితాలో చేర్చాలి

» బీసీ కులాల పేర్ల మార్పుపై ఫిర్యాదుల స్వీకరణ

హైదరాబాద్, జనవరి18 (ఆంధ్రజ్యోతి): పశుపోషణ, గొర్రెలు, మేకల పెంపకం కులవృత్తిగా ఉన్న ధన్గర్ కులాన్ని బీసీ జాబితాలో చేర్చాలని తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్‌కు ఆ కులం ప్రతినిధుల బృందం వినతి పత్రం సమర్పించింది. ఇటు 'బూంజువ' కులం విషయంలో జిల్లాల పరిమితులను ఎత్తివేయాలని ఆ కులం ప్రతినిధులు కోరారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే బూంజువ కులాలకు కులం సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని.. ఇతర జిల్లాల్లో ఇచ్చేలా చూడాలని బీసీ కమిషన్‌కు విన్నవించారు. జనవరి 3న బీసీ వర్గాల్లోని 8 కులాలకు పేర్ల మార్పులు, పర్యాయపదాలు జోడించాలనే అభ్యర్థనపై జారీ చేసిన నోటిఫికేషన్ గడువు ముగింపు సందర్భంగా అభ్యంతరాలు, ఫిర్యాదులను బీసీ కమిషన్ స్వీకరించింది.

ప్రజోపయోగ ప్రాజెక్టులకు సత్వర అనుమతులు

» కేంద్ర అటవీ శాఖ డైరెక్టర్ జనరల్ జితేంద్ర కుమార్

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజోపయోగ ప్రాజెక్టులకు సత్వరమే అనుమతులు మంజూరు చేస్తామని కేంద్ర అటవీ శాఖ డైరెక్టర్ జనరల్ జితేంద్ర కుమార్ తెలిపారు. తెలంగాణలో ఉన్న అటవీ అనుమతుల పెండింగ్ విషయంపై జితేంద్ర కుమార్, పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియల్ అధ్యక్షతన అత్యున్నత సమావేశం అరణ్య భవన్‌లో శనివారం జరిగింది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసి రాష్ట్రంలో అటవీ శాఖలో పెండింగులో ఉన్న వివిధ ప్రాజెక్టులపై చర్చించారు. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి అందుకు అనుగుణంగా జితేంద్ర కుమార్‌ను రాష్ట్ర అధికారులతో చర్చించేందుకు హైదరాబాద్ పంపించారు. పెండింగ్ ప్రాజెక్టులు, కారణాలు, ఇతర అంశాలపై జితేంద్ర కుమార్.. అటవీ, రోడ్లు భవనాలు, జాతీయ రహదారుల విభాగం అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం 161 ప్రాజెక్టులు అనుమతుల కోసం పెండింగులో ఉన్నాయని ఈ సందర్భంగా డోబ్రియల్ ఆయనకు వివరించారు. అంతకుముందు దక్షిణాది రాష్ట్రాల అటవీ అధికారులతో సమావేశమైన జితేంద్ర కుమార్.. 'ఏక్ పేడ్ మా కే నామ్' (తల్లి పేరుతో మొక్క నాటడం), నగర వన్ యోజన పథకాలపై ఆయన చర్చించారు.

ముదిరాజ్ కార్పొరేషన్‌కు 2 వేల కోట్లు ఇవ్వాలి

» జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధిక జనాభా ఉన్న ముదిరాజులలోనే అత్యధిక పేదరికం తాండవిస్తోందని, ముదిరాజుల అభ్యున్నతి కోసం ఏర్పాటుచేసిన కార్పొరేషన్‌కు రూ.2 వేల కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. తెలంగాణలోని ముదిరాజ్‌ల చైతన్యమే లక్ష్యంగా 'ముదిరాజు ప్రజా చైతన్య బస్సు యాత్ర'ను శనివారం హైదరాబాద్ గన్‌పార్క్ నుంచి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొదటి విడత కింద 5 జిల్లాల్లో పర్యటన ఉంటుందని, ఆ తరువాత రెండో విడతలో మిగిలిన జిల్లాల్లో యాత్ర చేస్తానని కుమారస్వామి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బ్యాంకుల్లో భద్రతా ఏర్పాట్లు పెరగాలి..

» సీసీ కెమెరాలతోపాటు నిపుణులైన సెక్యూరిటీని నియమించుకోవాలి: రాచకొండ సీపీ సుధీర్‌బాబు



హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులు తమ భద్రత ఏర్పాట్లను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని రాచకొండ సీపీ సుధీర్ బాబు సూచించారు. దేశంలో ఏటీఎం, బ్యాంకు దోపిడీ ఘటనలు వెలుగుచూస్తున్న నేపథ్యంలో నేర నివారణ చర్యల్లో భాగంగా కమిషనరేట్‌లో శనివారం బ్యాంకుల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. బ్యాంకుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, నిపుణులైన సెక్యూరిటీ సిబ్బంది నియామకంతోపాటు సైబర్ నేరాలను అడ్డుకునేందుకు ఎప్పటికప్పుడు సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఇటీవల రాయపర్తి, బీదర్, మంగళూరులో బ్యాంకు, ఏటీఎం దోపిడీ ఘటనలను పరిశీలిస్తే బ్యాంకుల్లో భద్రతా లోపాలు బయటపడ్డాయని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఉన్న 489 బ్యాంకుల్లో ఉన్న భద్రతా ఏర్పాట్లను పోలీసు అధికారులు పరిశీలించారన్నారు. పలు లోపాలను గుర్తించి ఆయా బ్యాంకు శాఖల వద్ద ఏర్పాట్ల గురించి సీపీ సదరు బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ప్రాజెక్టులకు అత్యవసర ప్రణాళిక రూపొందించాలి: ఈఎన్‌సీ అనిల్‌కుమార్

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ప్రాజెక్టుకు జాతీయ ఆనకట్టల భద్రత చట్టం(ఎన్‌డీఎస్‌ఏ), కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యవసర చర్యల ప్రణాళికను రూపొందించాలని డ్యామ్ భద్రత రాష్ట్ర కమిటీ ఛైర్మన్, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నిర్ణీత వ్యవధిలోగా ఈ ప్రణాళిక ను సిద్ధం చేయాలన్నారు. ప్రాజెక్టుల వరద గేట్లతోపాటు రెగ్యులేటరీ గేట్లను వెంటనే మరమ్మతు చేయాలని కోరారు. నిబంధనల ప్రకారం అన్ని మరమ్మతులు చేపట్టాలని నిర్దేశించారు. అన్ని కట్టల వద్ద వరద సజావుగా వెళ్లడానికి వీలుగా ఆక్రమణలు ఉంటే తొలగించాలని నిర్దేశించారు. ఇందుకు జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ శాఖ సహకారం తీసుకోవాలన్నారు. 10 వేల ఎకరాలకు పైగా నీటిని అందించే కాలువలను తొలి విడతలో మరమ్మతు చేయాలన్నారు. వానాకాలంలోపు పనులు పూర్తికావాలన్నారు. కాలువల గట్లపై వన మహోత్సవంలో మొక్కలు నాటాలని సూచించారు.

మహా.. హైదరాబాద్!

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి కోసం 50 ఏళ్ల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హుడా)ని 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఏర్పాటు చేశారు. అనంతరం నగర విస్తరణకు అనుగుణంగా 2008లో హుడాను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)గా మార్పు చేస్తూ అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాంతో హెచ్ఎండీఏ పరిధి 7,257 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. అందులో హైదరాబాద్ జిల్లాతోపాటు ఉమ్మడి జిల్లాలైన రంగారెడ్డి, మెదక్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. కాగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక జిల్లాల పునర్విభజనతో హెచ్ఎండీఏ పరిధి పెరగకపోయినా.. ఐదు జిల్లాలు ఏడు జిల్లాలుగా మారాయి. వీటిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలున్నాయి. ఇక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న షాద్‌నగర్.. రంగారెడ్డి జిల్లాలోకి రావడంతో మహబూబ్‌నగర్ జిల్లా హెచ్ఎండీఏలో లేకుండా పోయింది. దీంతో ప్రస్తుత హెచ్ఎండీఏ పరిధి.. ఏడు జిల్లాలు, 74 మండలాలు, సుమారు వెయ్యి గ్రామపంచాయతీలు, ఎనిమిది కార్పొరేషన్లు, 38కి పైగా మునిసిపాలిటీలతో కూడి ఉంది.

ప్రత్యేకం ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

ఆర్ఆర్ఆర్ అవతల ఐదు కిలోమీటర్ల వరకు..


హెచ్ఎండీఏ పరిధిలో మెరుగైన అభివృద్ధి కోసం ఉమ్మడి రాష్ట్రంలో 2013లో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్-2031ని తీసుకొచ్చారు. ఆ సందర్భంలోనే రీజినల్ రింగ్ రోడ్డును ప్రతిపాదిస్తూ మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచారు. అప్పటి అంచనాలకు అనుగుణంగా ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)ను హద్దుగా చేసుకొని హైదరాబాద్‌ను విస్తరించడంతోపాటు హెచ్ఎండీఏ పరిధిలో చేపట్టాల్సిన రీజినల్ రింగ్ రోడ్డును కొన్ని ప్రాంతాల్లో ఆ పరిధిని దాటేస్తూ నిర్ణయించారు. ఇప్పటికే ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి అలైన్‌మెంట్ కూడా ఖరారయింది. త్వరలోనే దక్షిణ భాగానికీ ఖరారు చేసే అవకాశాలున్నాయి. దీంతో హెచ్ఎండీఏ పరిధిని సైతం ఆర్ఆర్ఆర్‌పాటు అవతల 5కిలోమీటర్ల వరకు పెంచాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. ఆర్ఆర్ఆర్‌కు ఇరువైపులా అభివృద్ధి వేగంగా జరిగే అవకాశాలుండడంతో.. ఆ రోడ్డుకు అవతల కూడా పరిధిని పెంచుతున్నారు. దీంతో ఈ పరిధి 12-13 వేల చదరపు కిలోమీటర్లకు పెరిగే అవకాశాలున్నాయి. దీని పరిధిలోని ఏడు జిల్లాలు 11కు పెరగనున్నాయి. కొత్తగా నాలుగు జిల్లాలు నల్లగొండ, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ చేరనున్నాయి. హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలు ఇప్పటికే పూర్తిగా ఉండగా.. తాజాగా రంగారెడ్డి జిల్లా పూర్తిగా రానుంది. ఇక యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి జిల్లాలో అత్యధిక మండలాలు రానున్నాయి. హెచ్ఎండీఏ పరిధిలో పస్తుతమున్న 74 మండలాలకు అదనంగా మరో 32 మండలాలు చేరి 106 మండలాలు కానున్నాయి. జీహెచ్ఎంసీ, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌తోపాటు ఏడు మునిసిపల్ కార్పొరేషన్లు, 34 మునిసిపాలిటీలతో కలిపి మొత్తం 43 అర్బన్ స్థానిక సంస్థలు ఉండనున్నాయి.

కోర్ అర్బన్, సెమీ అర్బన్ ఏరియాలుగా

హెచ్ఎండీఏ పరిధిని విస్తరించేందుకు సూత్రప్రాయంగా నిర్ణయించిన ప్రభుత్వం.. జీహెచ్ఎంసీ పరిధిని కూడా ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించనుంది. దాదాపు 2వేల చదరపు కిలోమీటర్ల వరకు జీహెచ్ఎంసీ పరిధి పెరగనుంది. ఈ పరిధిలో జీహెచ్ఎంసీతోపాటు 33 గ్రామ పంచాయతీలు, 27 మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు ఉండగా వాటన్నింటినీ కోర్ అర్బన్ ఏరియాగా నిర్ధారించి అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇక ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతాన్ని సెమీ అర్బన్ ఏరియాగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాంతంలో ఆర్ఆర్ఆర్‌కు ఆవల 5కిలోమీటర్ల వరకు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించే బాధ్యతలను కూడా హెచ్ఎండీఏకు అప్పగించారు. ఈలోపు హెచ్ఎండీఏ పరిధిని విస్తరిస్తూ బోర్డు సమావేశం జరపడంతోపాటు క్యాబినెట్‌లో చర్చించి.. అవసరమైతే అసెంబ్లీలో బిల్లును కూడా పెట్టే అవకాశాలున్నాయి.

హెచ్ఎండీఏ విస్తరణను ప్రతిపాదిస్తూ రూపొందించిన మ్యాప్

- మ్యాప్‌లో బ్లూ లైన్‌తో సూచిస్తున్నది ప్రస్తుతం హెచ్ఎండీఏ విస్తరించి ఉన్న పరిధి
- రెడ్ లైన్‌లో సూచిస్తున్నది త్వరలో నిర్మాణం జరుపుకోనున్న రీజనల్ రింగ్ రోడ్డు
- రెడ్ లైన్ బయట ఉన్న ప్రదేశం హెచ్ఎండీఏ విస్తరించనున్న ప్రతిపాదిత పరిధి.



హెచ్ఎండీఏలో కొత్తగా చేరే మండలాలు..

- రంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే 22 మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా.. కొత్తగా మరో ఐదు మండలాలు తలకొండపల్లి, ఆమనగల్లు, మాడుగుల, కడ్తాల్, కేశంపేట చేరనున్నాయి. దీంతో రంగారెడ్డి జిల్లాలోని మొత్తం 27 మండలాలు హెచ్ఎండీఏ పరిధిలోకే రానున్నాయి.
- సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే 8మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా.. కొత్తగా మరో మూడు మండలాలు చౌటకూర్, కొండాపూర్, సదాశివపేట రానున్నాయి.
- సిద్దిపేట జిల్లాలో ఇప్పటికే మూడు మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా.. కొత్తగా మరో మూడు మండలాలు గజ్వేల్, జగదేవ్‌పూర్, రాయపోల్ చేరనున్నాయి.
- మెదక్ జిల్లాలో ఇప్పటికే ఐదు మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా.. కొత్తగా మాసాయిపేట మండలం చేరనుంది.
- యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇప్పటికే ఐదు మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా.. కొత్తగా మరో ఐదు మండలాలు సంస్థాన్ నారాయణపురం, వలిగొండ, రాజపేట, యాదగిరిగుట్ట, తుర్కపల్లి చేరనున్నాయి.

కొత్తగా చేరే జిల్లాల్లోని మండలాలు..

- వికారాబాద్ జిల్లా హెచ్ఎండీఏ పరిధిలో కొత్తగా చేరనుండగా.. ఇందులో ఐదు మండలాలు మాత్రమే రానున్నాయి. మోమిన్‌పేట, నవాబ్‌పేట, పరిగి, పూడూరు, వికారాబాద్ మండలాలు కొత్తగా హెచ్ఎండీఏ పరిధిలోకి రానుండగా.. అందులోనూ కొన్ని గ్రామాలే ఉంటాయి.
- నల్లగొండ జిల్లా హెచ్ఎండీఏ పరిధిలో కొత్తగా చేరనుండగా.. ఇందులో కేవలం 6మండలాలు మాత్రమే రానున్నాయి. వీటిలోనూ గట్టుప్పల్ మండలం మినహా చండూరు, చింతపల్లి, మర్రిగూడ, మునుగోడు, నాంపల్లి మండలాల్లో కొన్ని గ్రామాలు రానున్నాయి.
- మహబూబ్‌నగర్ జిల్లా హెచ్ఎండీఏ పరిధిలో కొత్తగా చేరనుండగా.. ఇందులో కేవలం మూడు మండలాలు నవాబ్‌పేట, బాలానగర్, రాజపూర్ లలోని కొన్ని గ్రామాలు మాత్రమే రానున్నాయి.
- నాగర్‌కర్నూల్ జిల్లా హెచ్ఎండీఏ పరిధిలో కొత్తగా చేరనుండగా.. ఇందులో కేవలం వెల్దండ మండలంలోని మూడు గ్రామాలే రానున్నాయి.

ఢిల్లీలో రేవంత్‌ది అబద్ధాల ప్రచారం

» ముందు చిరుద్యోగులకు జీతాలివ్వండి: హరీశ్ రావు

» రేషన్ కార్డుల జారీలో నిబంధనలు సవరించాలని సీఎంకు లేఖ

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి అక్కడి ప్రజలను అబద్ధాలతో నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణలో ఇచ్చిన హామీలను అమలు చేశామని చెబుతున్నారని, ముందుగా చిరుద్యోగులకు జీతాలు చెల్లించాలని శనివారం ఒక ప్రకటనలో ఆయన డిమాండ్ చశారు. కాంగ్రెస్ పాలనలో చిరుద్యోగుల పరిస్థితి దారుణంగా మారిందని, జీతాల కోసం రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొందన్నారు. 4 నెలలుగా పంచాయతీ కార్మికులు, 3 నెలలుగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లేదని పేర్కొన్నారు. అలాగే మునిసిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు నెల రోజుల జీతం బకాయి పడ్డారని, ఇంట్లో అన్ని సమస్యలు పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పెట్టుబడుల కోసమంటూ పర్యటనలతో కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. కుర్చీని కాపాడుకోవడానికి ఢిల్లీ వెళ్లి చక్కర్లు కొట్టడం మాని చిరుద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతో లక్షలాది మంది లబ్ధిదారులు నష్టపోతున్నారని, నిబంధనలు సవరించాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగలేఖ రాశారు.

ప్రభుత్వ విధానాల వల్లే రైతు ఆత్మహత్యలు

» హామీల అమలుకు కొట్లాడుదాం: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): 'పంట ఉత్పత్తుల్లో అగ్రగామిగా ఉన్న తెలంగాణ ఈ రోజు రైతు ఆత్మహత్యల్లో ప్రథమ స్థానంలో ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలే ఇందుకు కారణం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన రైతు జాదవ్ నాగోరావ్ ఐసీఐసీఐ బ్యాంకు శాఖకు వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం పట్ల శనివారం ఓ ప్రకటనలో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వం చేసిన హత్య అని ఆరోపించారు. రుణమాఫీ చేయకుండా తప్పించుకునేందుకు సర్కారు ప్రయత్నిస్తుండటమే రైతుల ఆత్మహత్యలకు కారణమన్నారు. అధికారంలోకి రాగానే 2 లక్షల రుణమాఫీ చేస్తానన్న సీఎం రేవంత్ మాట తప్పడంతోనే నాగోరావ్ బలయ్యారన్నారు. ఈ ప్రభుత్వంపై హత్యానేరం కింద కేసు నమోదు చేయాలని, రైతు కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీద్దామని, హామీలు అమలయ్యేవరకు కొట్లాడుదామని, రైతులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని కోరారు.

బీఆర్ఎస్‌కు 41కోట్లు ఎందుకిచ్చారు?

(మొదటిపేజీ తరువాయి)

ఏసీబీ అధికారులు పలు ప్రశ్నలు సంధించారు. క్రీడల్లో ఏమాత్రం అనుభవం లేని మీ కంపెనీ ఇందులోకి ఎందుకు దిగింది? ఎవరు మిమ్మల్ని ఆహ్వానించారు? మీకే విధమైన హామీలిచ్చారు? ఒప్పందానికి ముందే బీఆర్ఎస్‌కు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.41 కోట్ల మొత్తం ఎందుకిచ్చారు? రేసు ద్వారా మీ కంపెనీకి లాభం వచ్చిందా? నష్టం వచ్చిందా? ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ రెండో సెషన్ పూర్తి చేయకుండానే ఎందుకు వైదొలిగారు? తదితర ప్రశ్నలు అడిగారు. మాజీమంత్రి కేటీఆర్‌తో ఉన్న సాన్నిహిత్యానికి సంబంధించి కూడా ప్రశ్నించినట్లు తెలిసింది. 'ఫార్ములా-ఈ కారు రేసులో ప్రమోటర్‌గా ఉండబోతున్న విషయం మీకు ఎప్పుడు తెలిసింది? మిమ్మల్ని ప్రమోటర్‌గా ఆహ్వానించింది కేటీఆరేనా? ప్రమోటర్‌గా అవకాశం లభించనున్న సంగతి తెలిసే.. రేసు ప్రారంభం అవడానికి ముందు ఏస్ నెక్స్‌జెన్, ఏస్ రేస్ కంపెనీలను ప్రారంభించారా? అప్పట్లో మీకు, రాష్ట్ర పురపాలకశాఖకు, అప్పటి మంత్రి కేటీఆర్‌కు మధ్య జరిగిన సంభాషణలేమిటి?' అంటూ అనిల్ కుమార్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

మళ్లీ విచారణకు పిలుస్తాం!

రేసు మొదటి సెషన్‌కు సంబంధించి 'ఫార్ములా ఈ ఆపరేషన్స్' (ఎఫ్ఈఓ) కంపెనీకి చెల్లించాల్సిన రూ.90 కోట్ల ఫీజును ఏస్ అర్బన్ డెవలపర్స్ నుంచి రుణం రూపంలో ఎందుకు తీసుకున్నారనే కోణంలోనూ ఏసీబీ విచారణ కొనసాగినట్లు సమాచారం. ఏస్ అర్బన్ డెవలపర్స్ కంపెనీ ఏస్ నెక్స్‌జెన్, ఏస్ రేస్ కంపెనీల అనుబంధ సంస్థనే కావటం గమనార్హం. కాగా, విచారణకు సమయం తక్కువగా ఉండటంతో మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని, మళ్లీ నోటీసు ఇస్తామని ఏసీబీ అధికారులు అనిల్ కుమార్ బృందానికి తెలిపినట్లు సమాచారం. అధికారుల ప్రశ్నలకు అనిల్ కుమార్ సమాధానమిస్తూ.. అప్పట్లో ఏం జరిగిందనే సంగతిని వివరంగా వెల్లడించినట్లు తెలిసింది. ఎలక్టోరల్ బాండ్లను అన్ని రాజకీయపార్టీలకు ఇచ్చినట్లే బీఆర్ఎస్‌కు ఇచ్చామని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. తమ కంపెనీ చట్టపరంగా ఒప్పందం చేసుకుందని, నష్టం రావడంతో రెండో సెషన్ నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని, నాటి అధికారులకు, మంత్రికి చెప్పిన తర్వాతే తప్పుకొన్నామని అనిల్ వెల్లడించారు.


ఆలస్యంగా మొదలైన విచారణ

వాస్తవానికి ఏస్ నెక్స్‌జెన్ కంపెనీ ప్రతినిధులు ఉదయం పదిన్నరకు ఏసీబీ కార్యాలయంలో హాజరు కావాల్సి ఉండగా, తమ విమానం ఆలస్యం అయ్యిందని, తమకు కొంత సమయం ఇవ్వాలని వారు ఏసీబీని కోరారు. దీంతో మధ్యాహ్నం తర్వాత విచారణకు రావచ్చని ఏసీబీ అధికారులు సూచించడంతో మధ్యాహ్నం రెండున్నరకు ఏస్ నెక్స్‌జెన్ ఎండీ చలమలశెట్టి అనిల్‌కుమార్‌తో పాటు మరికొందరు ప్రతినిధులు ఏసీబీ కార్యాలయానికి వచ్చారు. మూడున్నర గంటల పాటు విచారణ కొనసాగింది.


ఇవీ ఆరోపణలు..

హైదరాబాద్‌లో నాలుగు సెషన్లలో ఫార్ములా-ఈ కారు రేసు నిర్వహించడం కోసం రాష్ట్ర పురపాలకశాఖ, ఎఫ్ఈఓ, ఏస్ నెక్స్‌జెన్ మధ్య 2022 అక్టోబరు 25న త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం ఏస్ నెక్స్‌జెన్ ప్రమోటర్‌గా ఉంటూ 9, 10, 11, 12 సెషన్లకు సంబంధించిన ఫీజును ఎఫ్ఈఓకు వాయిదాల రూపంలో చెల్లించాలి. బ్రిటన్‌కు చెందిన ఎఫ్ఈఓతో అప్పటి పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ తొలిదఫా చర్చలు జరిపిన తర్వాత.. హఠాత్తుగా ఏస్ నెక్స్‌జెన్, ఏస్ రేస్ కంపెనీలను 2022 జూలైలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ కంపెనీల రిజిస్ట్రేషన్‌కు 15 రోజుల ముందే ఏస్ నెక్స్‌జెన్, ఏస్ రేస్ కంపెనీల మాతృసంస్థ గ్రీన్‌కో నుంచి రూ.10 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు బీఆర్ఎస్‌కు అందాయి. దానికి రెండు నెలల ముందు కూడా గ్రీన్‌కో నుంచే బీఆర్ఎస్‌కు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.31 కోట్లు లభించాయి. 9వ సెషన్ పూర్తయిన తర్వాత పదో సెషన్ ప్రారంభానికి ముందే ఏస్ నెక్స్‌జెన్ ఒప్పందం నుంచి వైదొలిగింది. కేటీఆర్ ఆదేశాల మేరకు పురపాలకశాఖ అధికారులు హెచ్ఎండీఏ నుంచి రూ.45.71 కోట్ల మొత్తాన్ని ఎఫ్ఈఓకు పౌండ్ల రూపంలో చెల్లించారు. వీటన్నింటిపైనా ఏసీబీ దర్యాప్తు చేస్తోంది.

కాలికి, చేతికి వైరు చుట్టి కరెంట్ షాక్ పెట్టి..



మృతుడు శంకర్




గోపాల్ (ఫైల్)

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌లో ఉన్నప్పుడు ఏడాది క్రితం తల్లిదండ్రులు లేని మరో యువతిని ప్రేమించి, పెళ్లి చేసుకుని తండాకు తీసుకొచ్చాడు. అయితే, శంకర్ భార్యతో గోపాల్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. తన భార్యతో గోపాల్ సన్నిహితంగా ఉండడాన్ని చూసిన శంకర్ గొడవ పడ్డాడు. తన భార్య జోలికి రావొద్దని తమ్ముడిని హెచ్చరించాడు. ఈ విషయంలో అన్నదమ్ముల మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. అయినా, గోపాల్ మారకపోవడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా పెట్టారు. దీంతో శంకర్ మూడో భార్య ఇల్లు వదిలి వెళ్లిపోయింది. అప్పటి నుంచి శంకర్‌పై గోపాల్ కక్ష పెంచుకున్నాడు. వదినతో బంధానికి అడ్డుగా ఉన్న అన్న అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఓ చోరీ కేసులో ఇటీవల జైలుకు వెళ్లి వచ్చిన గోపాల్ అవకాశం కోసం చూస్తున్నాడు. ఈ క్రమంలో శంకర్ మద్యం తాగి శుక్రవారం రాత్రి నిద్రపోయాడు. అతని వద్దే నిద్రించిన గోపాల్ అర్ధరాత్రి తర్వాత మేల్కొని.. శంకర్ కాలు, చేతికి విద్యుత్ వైర్లు చుట్టి ప్లగ్ బోర్డులో స్విచ్ ఆన్ చేశాడు. దీంతో శంకర్ విద్యుదాఘాతానికి గురై కేకలు వేశాడు. ఈ అలికిడికి నిద్ర లేచిన వారి తండ్రి చందర్.. తలుపులు తీయమని అరిచాడు. తలుపు తీసిన గోపాల్ తండ్రి చందర్‌ను నెట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. చందర్ లోపలికి వెళ్లి చూసే సరికి శంకర్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ మేరకు చందర్ నుంచి ఫిర్యాదు అందుకున్న తూప్రాన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు గోపాల్‌ను పోలీసులు శనివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు.

చిట్టీ వేసిన డబ్బులు తిరిగివ్వాలన్నందుకు మహిళ హత్య

» 6 నెలల క్రితం గొంతునులిమి చంపి పూడ్చివేత



విజయ(ఫైల్)

మోపాల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తనకు రావాల్సిన చిట్టీ డబ్బులు అడిగినందుకు ఓ మహిళను దారుణంగా హత్య చేశాడో వ్యాపారి. ఆరు నెలల తర్వాత విషయం బయటపడింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లాలో జరిగింది. మోపాల్‌కు చెందిన విజయ(45) వ్యవసాయ కూలీ. ఆమె భర్త విజయ్. వీరికి ఇద్దరు కుమారులు. విజయ్ దుబాయ్‌లో ఉండగా పంపిన డబ్బుల విషయంలో గొడవలు వచ్చి భార్యాభర్తలు విడిగా ఉంటున్నారు. మరోవైపు, మోపాల్‌కే చెందిన బుచ్చన్న అనే వ్యాపారి దగ్గర విజయ కొన్నేళ్ల పాటు చిట్టీ వేసింది. ఏడాది క్రితం చిట్టీ గడువు పూర్తయ్యాక.. తనకు రావాల్సిన డబ్బులు ఇచ్చేయాలని బుచ్చన్నను అడిగింది. కానీ, బుచ్చన్న ఏడాది పాటు రేపిస్తా.. మాపిస్తా.. అంటూ తప్పించుకు తిరిగాడు. 6 నెలల క్రితం బుచ్చన్నపై విజయ గ్రామపెద్దల ముందు పంచాయతీ పెట్టించింది. దీంతో విజయపై కోపాన్ని పెంచుకున్న బుచ్చన్న.. చిట్టీ డబ్బులు ఇస్తానని జూలైలో ఆమెను ఇంటికి రమ్మన్నాడు. తన వద్ద పని చేసే నగేశ్ సహాయంతో విజయకు కల్లు తాగించి.. ఆ తర్వాత గొంతు నులిమి చంపేశాడు. గ్రామ శివారులో మృతదేహాన్ని పూడ్చి పెట్టాడు. విజయ కుమారుడు మనోహర్.. ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తొర్రూరు సీఐగా గణేష్

తొర్రూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా గణేష్‌ను నియమిస్తూ పోలీసుశాఖ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ జగదీష్ ఏసీబీ కేసులో అరెస్టు కాగా, టీజీ ట్రాన్స్‌కోలో సీఐగా విధులు నిర్వహిస్తున్న టి.గణేష్‌ను తొర్రూరు సీఐగా నియమిస్తూ మల్టిజోన్ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. గణేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

పౌష్టికాహారాన్ని అందించాలి



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న తహసీల్దార్ భగవాన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని తహసీల్దార్ భగవాన్‌రెడ్డి అన్నారు. శనిగపురం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు పౌష్టికాహారాన్ని అందించి వారి విద్యాభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ బానోత్ హరిసింగ్, పాఠశాల హెచ్ఎం శ్రీధర్ పాల్గొన్నారు.



తొర్రూరులో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న అభిమానులు



మరిపెడలో ఎన్టీఆర్ ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళ్లర్పిస్తున్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు



కేసముద్రం విలేజిలో.. టీడీపీ నేత బండి పుల్లయ్య



ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లుపంపిణీ చేస్తున్న సీఎస్ఆర్ఎంవో జగదీశ్వర్, టీడీపీ నాయకులు

ఊరూరా ఎన్టీఆర్‌కు నివాళి

నెహ్రూసెంటర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పి మహనీయుడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ సీఎం ఎన్టీ రామారావు అని మహబూబాబాద్ పార్లమెంటరీ కన్వీనర్ కొండపల్లి రాంచందర్‌రావు కొనియాడారు. శనివారం ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో టీడీపీ కార్యాలయంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళ్లర్పించారు. అనంతరం మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ జగదీశ్వర్ చేతుల మీదుగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండపల్లి రాంచందర్‌రావు మాట్లాడుతూ పేద ప్రజల కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించి, 9నెలల్లోనే అధికారం చేపట్టిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు కడుపునింపేందుకు రూ.2లకే కిలో బియ్యం, ఇండ్లు, పింఛన్‌లు అందించారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారపు వెంకటనారాయణ, భూక్య సునీతామంగీలాల్, కొండపల్లి రాంచంద్రమ్మ, రాంరెడ్డి, రాజన్న, సైదులు, రాంమ్మూర్తి, భద్రు, రాము పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

మరిపెడ మునిసిపల్ కేంద్రంలో టీడీపీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని ఆ పార్టీ శ్రేణులు నిర్వహించారు. ఎన్టీఆర్ ఫ్లెక్సీకి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తాడూరి రమేష్, గండి సత్యనారాయణ, మామిడాల వెంకన్న, ఇరుగు రవి పాల్గొన్నారు.

- తొర్రూరులో ఎన్టీఆర్ చిత్రపటానికి అభిమానులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కుమారస్వామి, టీసీ అంజయ్య, సాంబ, రాయిశెట్టి వెంకన్న, భాస్కర్, పులేందర్, ప్రదీప్‌రెడ్డి, రవిబాబు ఉన్నారు.
- కేసముద్రం విలేజిలోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎండీ.ఇమాం, మాజీ సర్పంచ్ సట్ల సర్వయ్య, కదిరె సోమయ్య, బొల్లోజు రాంమోహన్‌చారి, మర్రి మహేందర్, ముదుసుల యాకయ్య, ఊట్కూరి వెంకటయ్య వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య మాట్లాడుతూ సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం అనే సిద్ధాంతాలపై తెలుగుదేశం పార్టీ నిర్మితమైందని తెలిపారు.
- గార్లలోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ శ్రేణులు పూలమాలలు వేసి, నివాళ్లర్పించారు. మండల అధ్యక్షుడు ఎలమరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు సుక్కాన ప్రసాద్, జాస్తీ రాజాబాబు, కత్తి సత్యంగౌడ్, పిడమర్తి రమేష్ పాల్గొన్నారు.
- బయ్యారం మండలం గంధంపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ శ్రేణులు కోటేశ్వర్‌రావు, శ్రీహరి, బాబురావు, శ్రీనివాస్ పూలమాలలు వేసినివాళ్లర్పించారు.
- డోర్నకల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి అభిమానులు పూలమాలలు వేసి, నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న, రావూరి మోహన్‌రావు, బిక్కసాని రామకృష్ణ, తాళ్లూరి హనుమ, రహీం, చావ వెంకటేశ్వర్లు, పాటి రమేష్, శీలం శ్రీనివాస్, రవి, ఫరీద్, బోడ హరి, మాద యాకాంబ్రం, మెదరమెట్ల శ్రీనివాస్, కుటుంబరావు పాల్గొన్నారు.
- కురవి మండలం బలపాలలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పుల్లయ్య పూలమాల వేసి నివాళ్లర్పించారు. మండల అధ్యక్షుడు పేరం వీరస్వామి, దేవులపల్లి కేశవరావు పాల్గొన్నారు.

'రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి'

నెహ్రూసెంటర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రత పట్ల ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని మహబూబాబాద్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) ఎం.సాయిచరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో రోడ్డు సెఫ్టీ భద్రత నియామాలపై విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైనర్లు డ్రైవింగ్ చేయకూడదని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సీటుబెల్టు, హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని చెప్పారు. ఈ సదస్సులో అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎస్‌బీఐలో రూ.2 వేలకు రూ.40 లక్షల బీమా'

కేసముద్రం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం భారతీయ స్టేట్ బ్యాంకు(ఎస్‌బీఐ)లో ఈనెల 20న ప్రత్యేక బీమా మేళా నిర్వహిస్తున్నట్లు బ్రాంచి మేనేజర్ శ్రీకాంత్ శనివారం తెలిపారు. ఈ మేళాలో నూతనంగా 18-65ఏళ్ల వయస్సున్న వారికి ఏడాదికి రూ.2వేల ప్రీమియంతో రూ.40లక్షల ప్రమాదబీమా సౌకర్యం పొందే పథకాన్ని అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. స్వల్ప ప్రీమియంతో అధిక బీమా రక్షణ కల్పించే పథకాన్ని అందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.

సర్వేలో పారదర్శకత పాటించాలి

తొర్రూరు రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు అందేవిధంగాసర్వేలో పారదర్శకత పాటించాలని తహసీల్దార్ జి.శ్రీనివాస్ సూచించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు సంబంధించిన సర్వేను ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది కలిసి చేపడుతున్నారు. శనివారం ఖానాపురంలో తహసీల్దార్ వ్యవసాయ భూములను, గుట్టలను పరిశీలించి మాట్లాడారు. ఏఈవో భరత్‌చంద్ర, పంచాయతీ కార్యదర్శి నిషాంత్, రెవెన్యూ సిబ్బంది వనిత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం కమిటీల ఎన్నిక



నరేందర్, రవి, ప్రవీణ్

ఇనుగుర్తి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మున్నూరుకాపు సంఘం ఇనుగుర్తి, అయ్యగారిపల్లి గ్రామాల్లో కమిటీలను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు నీలం శ్రీనివాస్ శనివారం ప్రకటించారు. ఇనుగుర్తి గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా వద్దిరాజు కిషన్, అధ్యక్షుడిగా కొణతం నరేందర్, ఉపాధ్యక్షులుగా పింగిళి వీరన్న, కొణతం వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా ఆవుల వెంకన్న, సహాయ కార్యదర్శులుగా శ్రీరాంచందర్, కందాల రంగన్న, కోశాధికారిగా కావటి రవి, సోషల్‌మీడియా కన్వీనర్‌గా సుంకరి శివ, యూత్ కమిటీ అధ్యక్షుడిగా బండి ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు. అయ్యగారిపల్లి అధ్యక్షుడిగా మలిశెట్టి రవి, ఉపాధ్యక్షులుగా బోళ్ల కృష్ణ, మెట్టు రాజు, ప్రధాన కార్యదర్శిగా చీకటి స్టాలిన్, సహాయ కార్యదర్శులుగా మామిడి కిరణ్, కోశాధికారిగా మలిశెట్టి శోభన్, గౌరవ సలహాదారులుగా మామిడి శోభన్, మలిశెట్టి శ్యాం, మద్దికుంట్ల వెంకన్నలను ఎన్నుకున్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి : టీడీపీ

పెద్దవంగర, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాల్సిందేనని టీడీపీ మండల అధ్యక్షుడు బైన భాక్షపతి, మాజీ ఎంపీపీ శంకర్‌రావు అన్నారు శనివారం మండలంలోని అవుతాపురంలో ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళుర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుజాతి ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, ప్రజాసంక్షేమ అనే సిద్ధాంతాలపై తెలుగుదేశం పార్టీని స్థాపించి బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బోదపల్లి లింగయ్య, యాకసోములు, అనిల్, యాకయ్య, వెంకన్న, వినోద పాల్గొన్నారు.

డోర్నకల్ మండలానికి 900 ఇండ్లేనా.!

- అధికారులను ప్రశ్నించిన ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్



ఎంపీడీవో కార్యాలయంలో అధికారులను ప్రశ్నిస్తున్న రాంచందర్‌నాయక్

డోర్నకల్, జనవరి18 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గతేడాది నిర్వహించిన ప్రజాపాలనలో 11 వేలఇండ్ల దరఖాస్తులు వస్తే.. 900 గృహాలుఎలా మంజూరు అయ్యాయని, కనీసం 3వేల ఇండ్లను మంజూరు చేయాలి కదా? అని డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్ అధికారులను శనివారం ప్రశ్నించారు. ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అధికారులు ఆలసత్వంప్రదర్శిస్తున్నారా! అని నిలదీశారు. ప్రతీ నిరుపేదకు రానున్న ఐదేళ్లలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణవేణి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుమీర్‌చంద్‌జైన్, వైస్‌చైర్మన్ కె.కోటిలింగం, కాంగ్రెస్ నాయకులు మాద శ్రీనివాస్, గంగాధర్, తాళ్లూరి హనుమ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

10న చలో ఢిల్లీని విజయవంతం చేయండి

- ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షుడు వర్రె బాలకృష్ణ

మహబూబాబాద్ టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్పీఆర్డీ) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10న జరుపతలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు వర్రె బాలకృష్ణ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో ఎన్పీఆర్డీ జిల్లా కమిటీ సమావేశాన్ని సీహెచ్.నరేష్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు కేంద్రప్రభుత్వం నెలకు కేవలం రూ.300 పెన్షన్ మాత్రమే ఇస్తుందని దానిని రూ.5 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. వికలాంగులందరికి అంత్యోదయ కార్డులు, అంగన్‌వాడీ పోస్టులు కల్పించడంతోపాటు బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందు లు కలుగకుండా ప్రతీ రైలులోని దివ్యాంగుల బోగిలో గార్డును ఏర్పాటు చేయాలన్నారు. రడం సారయ్య, గౌరమ్మ, సరిత, యాకయ్య, నాగరాజు, వెంకన్న, కళమ్మ, మనెమ్మ, పద్మ, వీరభద్రం పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

తొర్రూరు, జనవరి18 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం తొర్రూరులో చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన ప్రకారం. తొర్రూరుకు చెందిన వ్యాపారవేత్త రేగూరి నర్సయ్య (72) శుక్రవారం తన ఇంటిముందు నుంచి రోడ్డుపైకి వస్తున్న క్రమంలో ఓ బాలుడు ద్విచక్రవాహనంపై వచ్చి ఢీకొట్టడంతో తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు బాలుడితో పాటు, తండ్రి వెంకన్నపై పోలీసులు కేసు నమోదు చేశారు. నర్సయ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. వ్యాపారులు, ప్రజాప్రతినిధులు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పురుగుల మందుతాగి యువకుడు..

డోర్నకల్, (ఆంధ్రజ్యోతి) : మోదుగుగడ్డతండాలో గడ్డిమందు తాగిన యువకుడు చికిత్సపొందుతూ మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. సీఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం. తండాకు చెందిన బానోత్ నరేష్ (26) కుటుంబకలహాలతో ఈనెల 16న తన వ్యవసాయ క్షేత్రం వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ నరేష్ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తండ్రి బానోత్ దుబ్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎక్సైజ్ దాడుల్లో ఇద్దరి అరెస్ట్

కేసముద్రం,(ఆంధ్రజ్యోతి) : గిర్నీతండా, అమినాపురం, ఎన్టీఆర్‌నగర్, బ్రహ్మంగారిగుడి తండాల్లో శనివారం గూడూరు ఎక్సైజ్ సీఐ ఎస్.భిక్షపతి ఆధ్వర్యంలో గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక కేసు నమోదు, ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. అరెస్టయిన వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు చెప్పారు. 12 లీటర్ల గుడుంబా స్వాధీనపర్చుకొని 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఎస్ఐ రాజేశ్వరి, సిబ్బంది సుధాకర్, నరేష్, మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలి : సీపీఎం



మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

మహబూబాబాద్ టౌన్, జనవరి18 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డులివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య కోరారు. సదరు డిమాండ్‌తో మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రంలో ఒక్క రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ రవీందర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సమ్మెట రాజమౌళి, బానోత్ సీతారాంనాయక్, రావుల రాజు కుమ్మరికుంట్ల నాగన్న, నక్క సైదులు, బానోత్ వెంకన్న, తోట శ్రీనివాస్, ఎర్ర శ్రీనివాస్, మందుల మహేందర్, ప్రకాశ్, యాకయ్య పాల్గొన్నారు.

21న జిల్లాస్థాయి సివిల్ సర్వీస్ టోర్నమెంట్

- జిల్లా యువజన క్రీడల అధికారి జ్యోతి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 21న జిల్లాస్థాయి సివిల్ సర్వీస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి (డీవైఎస్వో) జ్యోతి శనివారం తెలిపారు. తెలంగాణ రాష్ట్రస్పోర్ట్స్ అథారిటీ వారి ఆదేశాల మేరకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ -2024-25 నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అథ్లెటిక్స్, చెస్, క్యారమ్స్, హాకీ, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మహిళలు, పురుషులు పాల్గొనవచ్చన్నారు. క్రికెట్, రెజ్లింగ్, గ్రీకోరోమన్, బెస్ట్ ఫిజిక్స్, ఖోఖో, యోగా మొదలగు పోటీల్లో పురుషులు మాత్రమే పాల్గొనాలని సూచించారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 23, 24 తేదీల్లో హైదరాబాద్ జింఖానా మైదానంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఈనెల 21న ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్ స్టేడియంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ : 94406 30681ను సంప్రదించాలన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

డోర్నకల్, జనవరి18 (ఆంధ్రజ్యోతి) : మీకు లాటరీ తగిలిందని, ఇంట్లో ఉంటూనే సంపాదన పెంచుకోవచ్చంటూ వచ్చే మెస్సేజ్‌లకు ఆకర్షితులై సైబర్‌నేరాల పట్ల పడితే బ్యాంకు ఖాతా ఖాళీ అవుతుందని సీఐ రాజేష్ అన్నారు. శనివారం ఉయ్యాలవాడలో శనివారం గ్రామస్థులకు సైబర్ నేరాలు, శాంతిభద్రతలు, మహిళ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఉయ్యాలవాడ గ్రామం సమస్యాత్మక గ్రామంగా ఇక ముందు ఉండబోదని చెప్పారు. గ్రామస్థులు అందరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, అనవసరంగా కేసుల పాలుకావొద్దని చెప్పారు. గ్రామంలోని యువకులు మత్తు పదార్థాలకు బానిస కాకుండ చదువుపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గడ్డం ఉమ, మాజీ సర్పంచ్ తాళ్లూరి రామయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహరావు, వెంకన్న, హనుమ, గ్రామస్తులు పాల్గొన్నారు.

- మహబూబాబాద్ రూరల్, (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రత, సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికరెడ్డి అన్నారు. సంద్రాలగూడెంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై దీపికరెడ్డి మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నియమనిబంధనలను పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు.

'ప్రజా ప్రతినిధులను అడ్డుకుంటాం'

గార్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : గార్ల పెద్దచెరువు భూములను ఆక్రమించిన రైతులకు వస్తాసుపలికితే ప్రజా ప్రతినిధులను అడ్డుకుంటామని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష రాజకీయ పార్టీల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువు భూములను కాపాడానికి ఆయకట్టు రైతులను సమీకరించి, ప్రజాఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సీపీఎం కాంగ్రెస్, న్యూడెమోక్రసీ టీడీపీ, బీఆర్ఎస్ నాయకులు కందునూరి శ్రీనివాస్, అలవాల సత్యవతి, భూక్యా నాగేశ్వరావు, ఎలమరెడ్డి కృష్ణారెడ్డి, కత్తి సత్యం, గంగావత్ లక్ష్మణ్‌నాయక్, జడ సత్యనారాయణ, జి.సక్రు పాల్గొన్నారు.

'అధికారులు మొహం చాటేస్తున్నారు'!



జాబితాలో పేర్లు లేకపోవడంతో తహసీల్దార్‌ను వివరాలు అడుగుతున్న మేగ్యాతండా గ్రామస్థులు

చిన్నగూడూరు, జనవరి18 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలనలో ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ , సర్వే జాబితాలో పేర్లు గల్లంతు కావడంతో అధికారులను అడిగితే తమపేరు లేదని మొహం చాటేస్తున్నారని సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు బాదావత్ సురేష్ ఆరోపించారు. శనివారం మండలంలోని మేగ్యాతండాలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రేషన్ కార్డుకోసం తమ గ్రామంలో 50మంది దరఖాస్తు చేసుకోగా, జాబితాలో వారిపేర్లు గల్లంతు కావడంతో ఆందోళన చెందుతున్నారని అన్నారు. అధికారులను నిలదీయగా గత ప్రభుత్వంలో మీ సేవలో ఆన్‌లైన్‌లో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలే పోర్టల్‌లో ఉన్నాయని అధికారులు తెల్పి చెప్పారని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న అర్హులైన పేదలు ఆందోళన చెందుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిరంజీవి, రాము పాల్గొన్నారు. కాగా, ఈ విషయంపై ఎంపీడీవో రామారావును వివరణ కోరగా ప్రజాపాలన దరఖాస్తులో రేషన్ కార్డులకు ఆన్‌లైన్ ఆప్షన్ ఇవ్వకపోవడం వలన గతంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు జాబితాలో ఉన్నాయని అన్నారు. జాబితా అనేది ప్రభుత్వం చేతిలో ఉందని, ప్రభుత్వ గైడ్‌లైన్ ప్రకారమే సర్వే చేస్తున్నామని తెలిపారు.

కళా ప్రదర్శనలతో చైతన్యం తీసుకురావాలి

- ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి నక్క సైదులు

మహబూబాబాద్ టౌన్, జనవరి18 (ఆంధ్రజ్యోతి) : కళాకారులు తమ కళా ప్రదర్శనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి నక్క సైదులు అన్నారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో శనివారం సీపీఎం అనుబంధ ప్రజానాట్యమండలి (పీఎన్ఎం) జిల్లా కమిటీ సమావేశాన్ని అల్వాల రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలకు మహబూబాబాద్ జిల్లాలోని పీఎన్ఎం కళాకారులు, అభ్యుదయవాదులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రజా నాట్యమండలి నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కృషి చేస్తుందని చెప్పారు. కళ కళ కోసం కాదు.. కళ ప్రజల కోసమని, పాలకవర్గాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా ప్రజానాట్యమండలి కళాకారులు పోరాడుతారని వివరించారు. ప్రభుత్వం ప్రజా కళాకారులను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాగేంద్ర, పవన్‌కుమార్, జంగం ఉప్పలయ్య, జహీర్‌ఖాన్, మల్లేష్, నరేందర్, స్వామి పాల్గొన్నారు.

ఉద్యమకారులకు టికెట్‌లు ఇవ్వాలి

నెల్లికుదురు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉద్యమకారులకు బీఆర్ఎస్ టికెట్‌లు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుడు వీరగాని మల్లేశంగౌడ్ కోరారు. నెల్లికుదురులోని విశ్రాంతి భవనంలో శనివారం తెలంగాణ ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులకు బీఆర్ఎస్ పార్టీ టికెట్లు ఇస్తే ప్రజలు గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఉద్యమకారులు మద్ది వెంకన్న, సుధగాని ఉపేందర్, క్రిష్ణయ్య, కందగట్ల వెంకటేష్, కొమురెల్లి, రాజారాం సంతోష్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరగాని మల్లేశంగౌడ్